

"ఆకాశంలో మెరుపు మెరిసినపుడు కాంతి వెద జల్లుతూ ఓ విద్యుత్ తీగకనిపిస్తుంది ఎప్పుడేనా చూస్తావా?"

"..............................."

"సూర్యోదయం అవుతున్న సమయంలో పచ్చగడ్డి మీద నిలబడ్డ మంచు బిందువుల అందాన్ని ఎప్పుడైనా చూశావా?"

"..............................."

"సంధ్యా సమయంలో పశ్చిమ దిక్కున ఆకాశం సిందూరం రంగు చీర కట్టుకుంటుంది. ఎప్పుడేనా గమనించావా?"

"..............................."

"పున్నమిరాత్రివాడు వెలరేగిన సముద్రంలో ఎగిరిపడే కెరటం తాలూకు హుషారుని నువ్వెపుడేనా గమనించావా?"

"..............................."

"అప్సరసల్ని వర్ణిస్తూ 'పృధు వక్షోజ నితంబ భారశ్రే యౌవ్వన ధనుస్సుల్లా వంగిపోతున్నా'రన్నాడు తిలక్- దాని అర్థం ఏమిటో తెలుసా?"

"..............................."

"ఒరేయ్–ఒరేయ్–ఒరేయ్... వయసులో వున్న మగాడికి వయసులో వున్న ఆడదాని అవసరం వుంటుందని కారల్‌మార్క్సూ, డార్విన్నూ, అయిన్‌స్టీన్నూ, శ్రీనివాస రామానుజం, చివరికి వాత్స్యాయనుడు అందరూ ఒప్పుకున్నార్రా– నీ ఒక్కడి ఖర్మ ఇలా కాలిపోయిందేమిట్రా?"

అప్పటికి రత్నబాబుకేసి చూశాడు శైలేంద్ర.

"ఏవిట్రా నీ గొడవ?" అనడిగాడు కూడా...

రత్నబాబుకి చిర్రెత్తుకొచ్చింది.

"అంతే– నువ్విలా కంప్యూటర్ రూంలో ఎ.సి. అనుభవిస్తూ కంప్యూటర్ మీద గుణింతాలు, ఎక్కాలు నేర్చుకుంటూ వుందూ, మరో పక్కన వయసుడిగిపోయి, జుట్టు తెల్లబడిపోయి, పళ్ళూడిపోయి, చర్మమంతా ముడతలు పడిపోయి... అయ్యో యవ్వనమంతా వృధా చేసేసావే అని

అఘో

రిద్దువుగాని..." అన్నాడు రత్నబాబు.

"అసలు విషయమేమిటో చెప్పరా–"

కుతూహలం చూపించాడు శైలేంద్ర.

"ఓ అమ్మాయిని చూసాను. చూసిన పావుగంటలో నీ దగ్గర వాలాను"

"అయితే ఏమిటంటావ్?"

"ఏమీ లనను. ఆ అమ్మాయిని ప్రేమించో, ఆమె తల్లిదండ్రుల్ని ఒప్పించో లేదా ఆవిణ్ణే లేవదీసుకుపోయో నువ్వా అమ్మాయిని పెళ్ళిచేసుకో. చేసుకుని బ్రహ్మచర్య దీక్ష నుంచి బైటపడు. ఇటు నేను, అటు నీ తల్లిదండ్రులు, పైన ముక్కోటి దేవతలు సంతోషిస్తారు. మొన్న మీ ఇంటికొచ్చినపుడు మీ అమ్మగారు నీ పెళ్ళి విషయమై నోటింగిచ్చేసారు."

"ఎవర్రా ఆ అమ్మాయి?" శైలేంద్ర అర్థం కానట్టు అడిగాడు.

"ఆ అమ్మాయి ఆకాశంలో మెరుపు మెరిసినపుడు కనిపించే విద్యుత్ తీగలా వుంటుంది."

సూర్యోదయ సమయంలో పచ్చ గడ్డి మీద నిలబడ్డ మంచు బిందువు లంత స్వచ్ఛంగా, నిర్మలంగా వున్నాయామె కళ్ళు.

సంధ్యా సమయంలో ఆకాశం ఏ రంగులో వుంటుందో అదే రంగు సిందూరం రంగు చీర కట్టుకుంది.

పున్నమిరాత్రినాడు చెలరేగిన సముద్రంలో ఎగిరిపడే కెరటంలా హుషారుగా వుంది.

అప్సరసలాగే పృథువక్షోజనితంబ భారమై యౌవ్వన ధనుస్సులా వంగిపోతోంది." రత్నబాబు వివరించాడు.

"అయిందా వర్ణన..."

"అవలేదు, పేరు మోహన. మన బ్యాంక్‌లో లోన్స్ డిపార్టుమెంటులో చేరింది. విశాఖపట్నం నుంచి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చింది. అసలామెను చూడగానే ఎవరేనా ఆవిడ్ని తీసుకుని గోల్డ్‌లోన్ కోసం వచ్చారేమో అనుకున్నాను"

రత్నబాబు చివరి వాక్యానికి శైలేంద్ర భళ్ళున నవ్వాడు. పైగా "ఇప్పటికి ఇరవైమంది ఆడపిల్లల గురించి చెప్పావు. నీకు నా పెళ్ళి రంధి తప్ప వేరే ఏ గొడవా లేదు" అన్నాడు.

రత్నబాబు మరోసారి తల కొట్టుకున్నాడు.

* * *

శైలేంద్ర స్ఫురద్రూపి. అందగాడని అందరూ ఒప్పుకుంటారు. బ్యాంక్‌లో ఆఫీసరు ఉద్యోగం. స్వతహాగా సంపన్నుడు. తల్లిదండ్రులు గుంటూరులో వుంటారు. అన్నకి, అక్కకి పెళ్ళిళ్ళు అయిపోయాయి.

ఇతనికొక్కడా పెళ్ళి చేసేస్తే బాధ్యతలు పూర్తవుతాయని, కృష్ణారామా అనుకుంటూ కాలం గడపాలని తల్లిదండ్రుల ఆశ. మూడేళ్ళుగా వారి ప్రయత్నాలు ఫలించడం లేదు.

"నేను పెళ్ళి చేసుకోను. ఆ లంపటంలో ఇరుక్కోవడం నా కిష్టం లేదు" శైలేంద్ర అందరికీ చెప్పే జవాబు ఇదే.

స్వామి వివేకానంద పుస్తకాలు చదివి ఇలా అయిపోయాడని అందరూ అనుకుంటుంటారు.

"అంతగా నీకా జీవితం ఇష్టం అయితే ఆ మార్గంలో వెళ్ళిపో... అంతేకాని- మమ్మల్నందర్నీ ఇలా ఏడిపించకు" రత్నబాబు అంటూంటాడు.

మోహనని ఎంత వర్ణించినా, ఆమె గురించి ఎన్ని రకాలుగా చెప్పినా రత్నబాబు శైలేంద్ర మనసుని అటు తిప్పలేకపోయాడు.

ఓ పది రోజులు పోయాక-

రత్నబాబు, శైలేంద్ర వాళ్ళ ఆఫీసు బిల్డింగ్‌లో రెండో అంతస్తులో లిఫ్టు దిగి నడిచి వెళుతున్నారు.

ఓ ఫైలు చేత్తో పట్టుకుని సౌందర్యాన్ని చుట్టూ వెదజల్లుతూ వయ్యారంగా నడిచి వెడుతోంది మోహన.

ఆమె తమని దాటుకుని వెళ్ళిపోయాక ఓసారి వెనక్కి తిరిగి చూసి "ఎవర్రా ఆ అమ్మాయి" అనడిగాడు శైలేంద్ర.

"నేను చెప్పను" రత్నబాబు బిగిసాడు.

"ప్లీజ్ చెప్పరా...." శైలేంద్ర బతిమాలాడు.

"చెప్పనుగాక చెప్పను"

ఇద్దరూ రెస్టారెంట్‌కి వెళ్ళారు. బిస్కట్లు, టీలు తీసుకున్నాక "లోన్స్ సెక్షన్లో ఓ బంగారు బొమ్మా, అపరంజి బొమ్మ చేరిందని ఆ మధ్య నీకు చెప్పానే- మోహన- ఆవిడే ఈవిడ"




ఎందుకో తెలియదు గాని శైలేంద్ర మనసు రెండంగుళాలు కిందికి జారిపోయింది.

మర్నాడు ఏదో పని కల్పించుకుని ఓ ఫైల్ చేత్తో పట్టుకుని లోన్స్ సెక్షన్‌కి వెళ్ళాడు.

మరొక ఆఫీసరుతో మాట్లాడుతూ మోహనవైపు దొంగచూపులు చూడడం మొదలుపెట్టాడు.

అప్పటివరకు ఇత్తడితోను, కంచుతోను, రాగితోను, ఇనుముతోను బొమ్మల్ని తయారుచెయ్యడానికి అలవాటుపడ్డ బ్రహ్మదేవుడు సడెన్‌గా మనసు మార్చుకుని బంగారంతో బొమ్మను తయారుచేసి ప్రాణం పోసి ఆ బ్యాంక్ హెడ్డాఫీసులో లోన్స్ సెక్షన్లో ఓ కుర్చీలో కూర్చోపెట్టినట్టుగా వుందామె.

పెడస్ట్రల్ ఫ్యాన్ గాలికి ఎగిరిపడుతున్న షిఫాన్ చీర కొంగు ఒడిసి పట్టుకుంటున్న ఆమె శాపవశాత్తు భూమి మీదకి వచ్చిన అప్సరసలా వుంది.

ఖరీదైన రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చుని ఎదురుగా వున్న ఫైల్లో ఏదో రాస్తూ ముందుకి ఉరికి పడుతున్న బలమైన వక్షోజాల్ని పైట కొంగులో దాచుకోవడానికి అవస్థపడుతున్న ఆమె అమృతం పంచడానికి వచ్చిన మోహినిలా వుంది.

టేబుల్ ఫుట్‌రెస్ట్ మీద మోపిన ఆమె పాదాలు పెద్ద సైజు తమలపాకుల్లా వున్నాయి. కాలివేళ్ళకు మట్టెలు లేవు.

అంతే!

శైలేంద్ర ఓ నిర్ణయానికి వచ్చేసాడు.

వెంటనే అక్కణ్ణుంచి వచ్చేసాడు.

* * *

నాలుగు రోజులు గడిచాయి.

"నాపేరు శైలేంద్ర. కంప్యూటర్ సెక్షన్లో ఆఫీసర్ని. మీతో కొంచెం మాట్లాడాలి... ఎప్పుడు ఎక్కడ అన్నది మీ ఇష్టం"

ఆమె కొంచెం ఆశ్చర్యపోయింది. అతన్ని పరికించి చూసింది.

"రేపు సాయంత్రం ఆరుగంటలకి మీ సెక్షన్‌కి వస్తాను" ఆమె చెప్పింది.

థాంక్స్ చెప్పి అతను వెళ్ళిపోయాడు.

అతనికా ముప్ఫై గంటలు అరవై యుగాల్లా గడిచాయి. అరవై యుగాలు గడిచిన ఆరు నిమిషాల తర్వాత ఆమె అతని సెక్షన్‌కి వచ్చింది.

అతనామెకు అసలు విషయం చెప్పాడు.

ఆమెను పెళ్ళి చేసుకోవాలన్న తన అభిలాష వ్యక్తపరిచాడు. మీ జీవితంలో వెలుగులు పూయిస్తానని, నందనవనంలో మిమ్మల్ని షికారు చేయిస్తానని చెప్పాడు.

మీరు నా జీవితంలో అడుగుపెడితే నా జీవితం ధన్యమవుతుంది అన్నాడు. ఇన్ని ఏళ్ళుగా లేనిది మిమ్మల్ని చూశాకనే పెళ్ళి మీద వాంఛ కలిగింది- ఇది మీ మహత్యమే అన్నాడు.

మీ జీవితాన్ని, మీ అందాన్ని పంచుకునే అదృష్టం కలిగించండి- అని వేడుకున్నాడు.

అతని మాటలు ఆమె ఎంతో ఆసక్తితో వింది.

అతను మాట్లాడుతున్నంతసేపు ఆమె చిర్నవ్వుతో, చేపల్లాంటి కళ్ళు తిప్పుతూ అలాగే కూర్చుంది.

"మీరు టైం తీసుకోండి. ఆలోచించుకోండి" అన్నాడతను చివర్న.

"ఆలోచించుకోవడానికేమీ లేదు. నా పెళ్ళి నిశ్చయమైపోయింది. అతను భోపాల్‌లో ఇంజనీర్‌గా పని చేస్తాడు. ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నాడు. రెండు నెలల్లో వచ్చేస్తాడు. అతనిక్కడకు రాగానే మా పెళ్ళి–

సారీ... అయాం సారీ

నా ప్రమేయం లేకుండానే మీలో ఆశలు కల్పించాను. ధైర్యంగా మీ మనసులో మాట చెప్పినందుకు థాంక్స్" అని లేచి ఆమె వెళ్ళిపోయింది.

* * *

వాచ్‌మన్ వచ్చి పిలిచేదాకా శైలేంద్ర అలాగే వుండిపోయాడు చేతన రహితంగా!

మర్నాడే విజయవాడకి ట్రాన్స్‌ఫర్ అడిగి ఆ మర్నాడు రిలీవ్ అయి వెళ్ళిపోయాడు. అంత మంచి స్నేహితుడు దూరంగా వెళ్ళిపోతున్నందుకు రత్నబాబు బాగా నొచ్చుకున్నాడు.

* * *

ఇంక అతను పెళ్ళి చేసుకోడన్న నిర్ణయానికి వచ్చేశారు శైలేంద్ర స్నేహితులు, సన్నిహితులు, తల్లిదండ్రులు.

మోహన తిరస్కారం అతని మనసు మీద భయంకరమైన ప్రభావం చూపింది. అతను జీవితం మీద ఆసక్తి, అనురక్తి లేనివాడిలా అయిపోయాడు. నిశ్శేతనంగా, నవ్వు, తుళ్ళు లేకుండా, వేళకి భోజనం చెయ్యడం, ఆఫీసుకెళ్ళి పనిచేసుకోవడం, అందరికీ దూరంగా, వంటరిగా– ఏమీ పట్టనట్టుగా అయిపోయాడు.

అతనెందుకలా అయిపోయాడో రత్నబాబుకి తప్ప ఎవరికీ తెలియదు.

అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఓసారి పండక్కి ఇంటికి వెడితే తండ్రి ఎదురుగా కూర్చుని "శైలూ... నిన్ను విసిగిస్తున్నాననుకో– తండ్రిగా నీతో కొన్ని విషయాలు చెప్పడం నా ధర్మంగా భావిస్తున్నాను. నాకూ, మీ అమ్మకీ వృద్ధాప్యం వచ్చేసింది. ఎప్పుడో పిలుపు వస్తుంది. వెళ్ళిపోతాం. అన్నయ్య, అక్కయ్య పెళ్ళిళ్ళు చేసుకుని వాళ్ళ సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు.

ప్రస్తుతం వున్న సామాజిక పరిస్థితులో ఎవరికీ తమ సంసారపు పరిధి దాటి ఇవతలికి తొంగి చూసే ఓపిక, తీరికా లేవు. నువ్వు వంటరివాడివైపోతావు నాన్నా. అదే నా బెంగ.

బందరు నుంచి ఓ సంబంధం వచ్చింది. పిల్ల ఎం.ఎ. పాసైంది. ఇరవై ఎనిమిదేళ్ళు. నీకూ ఆ అమ్మాయికి నాలుగేళ్ళు తేడా.

నువ్వు మాస్తానంటే....

"నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు. మీ మనసు కష్టపెడుతున్నాను. క్షమించండి" అని అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయాడు.

తండ్రి కళ్ళనీళ్ళు తుడుచుకోవడం అతను చూడలేదు.

* * *

రెండు నెలల తర్వాత...

బ్యాంక్ మీటింగుంటే శైలేంద్ర హైదరాబాద్ వెళ్ళాడు. మూడు రోజులు జరిగే మీటింగులకి మోహన అధ్యర్యం వహించింది. మొదటిరోజున శైలేంద్రను చూసి దగ్గరికి వచ్చి పలకరించింది నవ్వుతూ, ఆప్యాయంగా మాట్లాడింది.

ఆమె తన విషయాలన్నీ చెప్పింది.

పెళ్ళయిందట. ఇద్దరు పిల్లలట.

పెద్దవాణ్ణి మొన్ననే నర్సరీలో వేసిందట. శైలేంద్రని తమ ఇంటికి రమ్మని ఆహ్వానించింది.

అయిదు సంవత్సరాల తర్వాత శైలేంద్ర మోహనని చూసాడు. ఆమెలో ఎంత తేడా?

బాగా బుగ్గలొచ్చేసాయి. గడ్డం కింద చర్మం గంగడోలుగా వేళ్ళాడుతోంది. జబ్బలు లావుగా చిన్న సైజు అరటిబోదెల్లా వున్నాయి. నడుం అన్నది లేకుండా పై నుంచి కిందకి సిలిండర్లా వుంది. నడుం పక్కన టైర్లు అతికించినట్టుగా కండలు వేళ్ళాడుతున్నాయి. ఆ వంటికి సంబంధం లేనట్టుగా ఎత్తైన పిరుదులు...

బిగుతుగా ముందుకి కొట్టొచ్చినట్టుగా వుండే ఆమె గుండెలు అచేతనంగా పొట్టమీదకి ఒరిగిపోతున్నట్టున్నాయి. కళ్ళ కింద నల్లటి చారలు– వెలుగు తగ్గిన కళ్ళు.


మానవ శరీరం మీద కాలం ప్రభావం.

* * *

అదేరోజు సాయంత్రం శైలేంద్ర తండ్రికి ఫోన్ చేశాడు.

"బందరు సంబంధం ఖాయం చేయండి" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

## హైకూలు





మసక వెన్నెల
తెప్పల్ని లాక్కొస్తోంది
గోదావరిలో లాంచి

గోడలోంచి
మొలుస్తోంది మర్రిచెట్టు
ఏ కాకి నాటిందో!

నడికప్పు కంతల్లో చంద్రుడు
మా వూరి సినిమాకి
రోజూ ఓ దొంగ ప్రేక్షకుడు

చెరువు చుట్టూ
చెట్లు నాటారు
ఒకద్దంలో వంద తలలు

పరదా చాటు
ఘోషా పిల్ల
మబ్బు వెనుక చందమామ

దారికి మరమ్మత్తు
ఆచి తూచి
అడుగేస్తోంది రైలు

అయ్యో గేలానికి చిక్కి
కొట్టుకొంటోంది చేప
విలవిల్లాడింది పిల్లోడి మనసు

ఆకాశానికి ఒక్కడే
నిలువెల్ల చంద్రుళ్ళే
సుగాలీల పిల్లకి!

చలిగా ఉందని
మంట వేసాను రాత్రి
నేను తప్ప అందరూ కాగారు

కట్టవ వెనుక
మొలుస్తోన్న చందమామ
విచ్చుకొన్న తురక చింత



\- బి. వెంకట్రావు